




## ఆలేరు ఎమ్మెల్యే గ్రామంలో నీరు లేక ఎండిన పొలాలు

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం సైదాపురంలో రైతు వాగంటి సిద్దులు తన మూడెకరాల వరి పొలం నీళ్లు లేక ఎండిపోవటంతో పశువులను మేపుతున్న దృశ్యం. ఇంకో రైతు బండారి స్వామిది కూడా ఇదే పరిస్థితి. రెండు బోర్లు వేసినా పొలం పారకపోవటంతో నాలుగు ఎకరాల వరి పంట ఎండిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్న దృశ్యం. ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సొంతం గ్రామం సైదాపురంలో రైతులకు ఈ దుస్థితి రావటం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఎట్లా ఉందో దీన్నిబట్టి తెలుస్తున్నది. *—గుజ్జ నరేష్, స్టాఫ్ ఫోటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ, యాదాద్రి భువనగిరి జిల్లా.*

# ఈ వేసవి గడిచేదెట్లా?!

## రాష్ట్రమంతా నీళ్లకు కటకట • అడుగంటిన జలాశయాలు

**పదేండ్ల కనిష్ఠానికి నీటి నిల్వలు**
**కృష్ణాబేసిన్‌లో పరిస్థితి దారుణం**
**గోదావరి బేసిన్‌లోనూ నీటి ఎద్దడి**
**నిండుకున్న మిషన్ భగీరథ రిజర్వాయరు**
**సాగుకే కాదు తాగునీటికీ ఇక తిప్పలే**
**ముందు జాగ్రత్తలపై దృష్టి పెట్టని సర్కార్**



హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి. గుక్కెడు నీళ్ల కోసం అలమటించాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన రిజర్వాయర్లతోపాటు మిషన్‌భగీరథ రిజర్వాయర్లు సైతం వేసవి ప్రారంభంలోనే డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. మరోవైపు, భూగర్భజలాలు సైతం పడిపోతున్నాయి. వెరసి రాబోయే రెండు నెలలు సాగునీటికే కాదు.. తాగునీటికీ తిప్పలు తప్పని దుస్థితి నెలకొన్నది.

### ఎస్సారెస్పీలో పడిపోతున్న నిల్వలు

ఎస్సారెస్పీ ప్రాజెక్టులో నీటి నిల్వలు గత నెల 21 నాటికి 34 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం 17.88 టీఎంసీలకు పడిపోయాయి. ప్రాజెక్టు ఎఫ్‌ఆర్‌ఎల్ 332 మీటర్లు కాగా, డెడ్ స్టోరేజీ 320 మీటర్లు. ప్రస్తుతం ప్రాజెక్టు లెవల్ 324 మీటర్లుగా ఉన్నది. ఏప్రిల్ మొదటి వారం వరకు సాగునీటిని విడుదల చేయాల్సి ఉన్నందున అప్పటికి ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరుకోనున్నది. ఈ ప్రాజెక్టు నుంచి వేసవి తాగునీటి అవసరాలకు ప్రతి నెలా అర టీఎంసీ చొప్పున రాబోయే రెండు నెలలకు ఒక టీఎంసీ నీళ్లు అవసరం.

### ఎల్‌ఎండీ నెల క్రితమే డెడ్‌స్టోరేజీ

కరీంనగర్ నగరానికి ప్రధాన తాగునీటి వనరైన ఎల్‌ఎండీలోనూ పరిస్థితి దారుణంగా మారింది. నెల క్రితమే డెడ్ స్టోరేజీకి చేరుకున్నది. 24.034 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఎల్‌ఎండీ నిరుడు మార్చిలో 12.50 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం 5.31 టీఎంసీలే ఉన్నాయి. ఈ రిజర్వాయర్‌కు మిడ్‌మానేరు నుంచి 1,467 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇక్కడి నుంచి కాకతీయ కెనాల్ ద్వారా 3,125 క్యూసెక్కులను సాగు నీటి అవసరాల కోసం దిగువకు విడుదల చేస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారం వరకు సాగునీటి విడుదల కొనసాగనున్నది. మొత్తంగా ఎల్‌ఎండీలో మరో రెండు టీఎంసీల మేర నిల్వలు తగ్గిపోనున్నాయి.

### డెడ్‌స్టోరేజీకి మిషన్‌భగీరథ జలాశయాలు

వివిధ ప్రాజెక్టుల్లో భాగమైన పలు రిజర్వాయర్లను మిషన్‌భగీరథ పథకానికి గత ప్రభుత్వం అనుసంధానించింది. ప్రస్తుతం అందుకు సంబంధించిన రిజర్వాయర్లన్నీ ఇప్పటికే డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. పాలేరు రిజర్వాయర్ ద్వారా ఖమ్మం సహా ఐదు జిల్లాల్లోని 2,450 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించాల్సి ఉన్నది. పాలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా ప్రస్తుతం 9 అడుగులు ఉన్నది. ఐదు అడుగుల అట్టడుగు స్థాయి వరకు నీటిని తీసుకొని వినియోగించాలని అధికారులు నిర్ణయించినా మరో వారం పది రోజులకు మించి సరిపోవు. దీంతో పాలేరు నుంచి నీరు ఇవ్వలేమని, ఎక్కడికక్కడ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఇప్పటికే మౌఖిక ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగమైన ఎల్లూర్ రిజర్వాయర్, అదేవిధంగా మిషన్‌భగీరథలో భాగమైన కోయిల్‌సాగర్, రామన్‌పాడు, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, వైరా, పెండ్లిపాకల, ఉదయసముద్రం, గోపాలదిన్నె, శంకరసముద్రం, కుమ్రంభీం, మేడారం, భీమ్‌ఘన్‌పూర్, ధర్మసాగర్, చలివాగు తదితర ప్రాజెక్టుల్లో కొన్ని డెడ్ స్టోరేజీకి చేరుకోగా, మరో 15 రోజుల్లో మిగిలినవి కూడా చేరుకోనున్నాయి.

### నాగార్జునసాగర్ దయనీయం

నాగార్జునసాగర్ ఎఫ్‌ఆర్‌ఎల్ 590 అడుగులు కాగా, పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 312 టీఎంసీలు. ప్రస్తుతం ప్రాజెక్టు లెవల్ 513 అడుగులు ఉండగా 137 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ 510 అడుగులు కాగా, ఈ ఏడాది 505 అడుగులుగా నిర్ణయించారు. ఈ లెక్కన ఇప్పుడు వినియోగానికి మిగిలేవి సుమారు 14 టీఎంసీలు. మార్చి నెలకు సంబంధించి సాగర్ నుంచి ఏపీకి ఐదు టీఎంసీలను విడుదల చేయాల్సి ఉన్నది. అవి మినహాయిస్తే తొమ్మిది టీఎంసీలే ఉంటాయి. అయినా శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్ల నుంచి నీటిని వినియోగించుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు.

### కృష్ణా ప్రాజెక్టులు వెలవెల

ఈ ఏడాది ఆశించిన రీతిలో వర్షపాతం నమోదైనప్పటికీ ఎగువ ప్రాంతాల్లో సరైన వర్షాలు కురవలేదు. దీంతో కృష్ణా బేసిన్‌లో జూరాల, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులకు అంతగా వరదలు రాలేదు. ఈ మూడు ప్రాజెక్టులపై ఆధారపడిన లిఫ్టులు కూడా పని చేయలేని పరిస్థితి నెలకొనడంతో వాటి అనుబంధ రిజర్వాయర్లన్నీ నీళ్లు లేక బోసిపోతున్నాయి. పెద్ద ప్రాజెక్టులే కాకుండా మధ్యతరహా, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లోనూ ఇదే దుస్థితి నెలకొనడంతో కృష్ణా బేసిన్‌లో భూగర్భజలాలు పాతాళానికి పడిపోతున్నాయి.

### అడుగంటుతున్న గోదావరి బేసిన్

గోదావరి బేసిన్‌లో ఈ ఏడాది సమృద్ధిగానే వర్షాలు కురవడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 199, సింగూరుకు 21, నిజాంసాగర్‌కు 41, మిడ్‌మానేరుకు 42, ఎల్‌ఎండీకి 67.79, కడెం ప్రాజెక్టుకు 60.37 టీఎంసీల వరద జలాలు వచ్చాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు మొత్తంగా 395.78 టీఎంసీల జలాలు చేరినప్పటికీ గోదావరి బేసిన్‌లోనూ నీటిఎద్దడి నెలకొన్నది. ఇక, మీడియం, మైనర్ ప్రాజెక్టులైన రామప్ప, లక్నవరం, పాకాల, మత్తడివాగు, నీల్వాయి, కిన్నెరసాని, పాలేరు, పాలెం, కోటిపల్లి, వైరా, లంకాసాగర్, మూసీ, శనిగరం, రామడుగు, మల్లూరు, గుండ్లవాగు, బయ్యారం, స్వర్ణ తదితర ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు వేసవికి ముందే అడుగంటాయి.

## లోలోతుకు భూగర్భ జలాలు

ప్రాజెక్టులు అడుగంటి పోవడం, కాలువ ద్వారా ఆశించిన మేర నీటిసరఫరా లేకపోవడంతో ఈ ఏడాది వేసవికి ముందే రాష్ట్రవ్యాప్తంగా భూగర్భజల మట్టాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నది. నిరుడు ఇదే సమయానికి 7.34 మీటర్లు ఉన్న సగటు భూగర్భజల మట్టం ఇప్పటికే 8.70 మీటర్లకు దిగజారినట్టు ప్రభుత్వ నివేదిక స్పష్టం చేస్తున్నది. ఏప్రిల్ నెలాఖరుకు ఈ మట్టాలు మరింత పడిపోవడం ఖాయమని, దీంతో ఈసారి తాగునీటికి సైతం తండ్లాట తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### కృష్ణాబేసిన్‌లో మిషన్‌భగీరథకు అనుసంధానమైన ప్రధాన రిజర్వాయర్లు, నీటినిల్వలు

| రిజర్వాయర్ | ఎఫ్‌ఆర్‌ఎల్ (ఫీట్లు) | ఎండీడీఎల్ | ప్రస్తుత లెవల్ |
|---|---|---|---|
| పాలేరు | 133.90 | 133.29 | 131.32 |
| ఏకేబీఆర్ నల్లగొండ | 245.00 | 241.40 | 242 |
| వైరా | 95.88 | 94.65 | 93.95 |
| పెండ్లిపాకల | 237.50 | 229.80 | 228.90 |
| ఉదయసముద్రం | 220 | 219.32 | 217.71 |
| కోయిల్‌సాగర్ | 411.33 | 409.35 | 408.80 |
| గోపాలదిన్నె | 304.24 | 301.75 | 302.65 |
| ఎల్లూర్ | 338.50 | 338.50 | 336.80 |
| శంకరసముద్రం | 358.19 | 350.00 | 349.84 |
| రంగసముద్రం | 325.50 | 316.84 | 319.50 |

### గోదావరిబేసిన్‌లో మిషన్‌భగీరథకు అనుసంధానమైన రిజర్వాయర్లు, నీటినిల్వలు..

| | | | |
|---|---|---|---|
| కుమ్రంభీం | 243 | 234.60 | 237.10 |
| ఎల్లంపలి | 148.00 | 146.40 | 144.22 |
| భీమ్‌ఘనపూర్ | 166.90 | 166.91 | 165.15 |
| ధర్మసాగర్ | 308.00 | 307.46 | 306.00 |
| చలివాగు | 217.01 | 212.10 | 211.90 |
| ములుగుఘన్‌పూర్ | 194.53 | 191.92 | 193.10 |



### కృష్ణా బేసిన్‌లోని వివిధ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు (టీఎంసీల్లో)

| రిజర్వాయర్ | పూర్తిస్థాయి నిల్వ | ప్రస్తుతనిల్వ | నిరుడు ఇదే సమయానికి |
|---|---|---|---|
| జూరాల | 9.66 | 3.52 | 4.14 |
| శ్రీశైలం | 215.81 | 34.74 | 34.98 |
| నాగార్జునసాగర్ | 312.05 | 137.86 | 174.26 |

### గోదావరి బేసిన్‌లోని వివిధ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు (టీఎంసీల్లో)

| | | | |
|---|---|---|---|
| సింగూరు | 29.91 | 18.85 | 20.56 |
| నిజాంసాగర్ | 17.80 | 6.17 | 6.99 |
| శ్రీరాంసాగర్ | 90.31 | 18.16 | 32.06 |
| మిడ్‌మానేరు | 25.87 | 9.49 | 20.12 |
| లోయర్‌మానేరు | 24.07 | 5.31 | 12.25 |
| కడెం | 7.60 | 2.96 | 4.25 |



# పత్తి రైతులకు సీసీఐ ధోకా

- **నాణ్యత లేదని గిట్టుబాటు ధర తగ్గింపు**
- **గిట్టుబాటు కంటే ఎక్కువ చెల్లిస్తున్న వ్యాపారులు**
- **పెరిగిన పత్తి ధరలు.. భారీగా నష్టపోయిన రైతులు**

ఆదిలాబాద్, మార్చి 25(నమస్తే తెలంగాణ) : పత్తి రైతులకు గిట్టుబాటు ఇచ్చి ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నాణ్యతపేరుతో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా సీసీఐ ఆధ్వర్యంలో అధికారులు పది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి క్వింటాలుకు రూ.7,020 చొప్పున గిట్టుబాటు ధర కల్పించింది. అక్టోబర్ చివరివారంలో ప్రారంభమైన పత్తి కొనుగోళ్లు ప్రస్తుతం చివర దశకు చేరుకున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 21 లక్షల క్వింటాళ్ల పత్తి విక్రయాలు జరిగాయి. ఇందులో 17 లక్షల క్వింటాళ్లను 84 వేల మంది రైతుల వద్ద నుంచి సీసీఐ కొనుగోలు చేసింది. కానీ సీసీఐ నాణ్యత పేరుతో రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా క్వింటాలుకు రూ.50 తగ్గించి రూ.6,970తో కొనుగోలు చేసింది. ఇంతటితో ఆగకుండా జనవరి 1 నుంచి పంట ధరను ఏకంగా రూ.100 తగ్గించి క్వింటాలుకు రూ.6,920తో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసింది. కానీ ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.7,550తో పత్తిని కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ.530 ఎక్కువగా చెల్లిస్తున్నారు. సీసీఐ రూ.6,920 చెల్లించగా ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.630 అధికంగా చెల్లిస్తున్నారు. దీని వల్ల రైతులు కోట్ల రూపాయలను నష్టపోవాల్సి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ క్వింటాలుకు రూ.100 ధరను తగ్గించగా, అదే పత్తిని ప్రైవేటు వ్యాపారులు ఎక్కువ ధరతో ఎలా కొనుగోలు చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. పంట నాణ్యత పేరిట రైతులను నష్టాలకు గురిచేసిన సీసీఐ అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



*ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి వాహనాలు (ఫైల్)*

# రైతన్నను రచ్చకీడ్చి...

మొదటిపేజీ తరువాయి...

చెల్లించాలి... బ్యాంక్ మొండి బకాయిలను వెంటనే కట్టాలి' అనే ప్లకార్డులను పట్టుకొని రైతులపై ఒత్తిడి తెచ్చారు. 'కాంగ్రెస్ సర్కారు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిందని, ఇప్పుడు మీరు రుణాలు చెల్లించాలంటే ఎలా ? అని రైతులు ప్రశ్నించారు. బ్యాంకుకు రాజకీయాలకు సంబంధం లేదని, రుణాలు చెల్లించాల్సిందేనని అధికారులు దౌర్జన్యం చేశారు. 'పంటలు నష్టపోయి..సచ్చిపోయి బతుకుతున్నాం.. ధాన్యం అమ్మిన పైసలొచ్చాక మీ అప్పులు చెల్లిస్తాం' అని కొత్వాల్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు భాస్కర్ రాజు, నర్సింలు, శంకరప్పలు అధికారులను బతిమిలాడారు. అయినప్పటికీ బ్యాంకు అధికారులు వడ్డీ పైసలు చెల్లిస్తేనే ఇక్కడి నుంచి వెళ్తామని మొండికేశారు. దీంతో రైతులు 'మీ అప్పు కోసం మేము ఏమన్న తాగి చావాలా..? ఒక్క పైసా కూడా కట్టం.. మీ ఇష్టం ఉన్నట్టు చేసుకోండని కరాఖండిగా చెప్పారు. అంతేకాదు రూ.50 వేలు అప్పు తీసుకుంటే రూ.2 లక్షలు ఎలా అయ్యాయని బ్యాంక్ అధికారులను ప్రశ్నించారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానన్న రేవంత్‌రెడ్డి వచ్చే వరకు ఒక్క పైసా కూడా చెల్లించేది లేదని రైతులు బ్యాంక్ అధికారులకు స్పష్టం చేశారు.

# రైతులను 'ఫసల్' ఆదుకునేనా!

## ప్రభుత్వ నిర్లక్ష్యం... రైతుల పాలిట శాపం!

- **'బీమా' అమలుపై నీలినీడలు**
- **ఈసీ అనుమతి తప్పనిసరి అంటున్న అధికారులు**

హైదరాబాద్, మార్చి 25(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం రైతులపాలిట శాపంగా మారింది. ఫలితంగా వచ్చే వానకాలం సీజన్ నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (ప్రధానమంత్రి పంటల బీమా పథకం) అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. కేంద్రం అనుమతించినప్పటికీ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల కమిషన్ అనుమతి లభించే అవకాశం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఎంపీ ఎన్నికల షెడ్యూల్‌కు చాలా రోజుల ముందే పథకాన్ని అమలు చేయాలని భావించిన ప్రభుత్వం తక్షణమే ప్రక్రియ ప్రారంభించినట్లయితే ఇప్పుడు కోడ్ ప్రభావం ఉండేది కాదని, ఈ విషయంలో ఇటు ప్రభుత్వం, అటు వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### క్లస్టర్ల వారీగా ప్రణాళికలు

రాష్ట్రంలో గతంలో అమలు చేసిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజననే తిరిగి కొనసాగించాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. రైతుకు అనుకూలంగా లేదన్న భావనతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020లో ఈ పథకం నుంచి బయటకు వచ్చింది. అయితే, ఏదో ఒక పంటల బీమా పథకం ఉండటమే మేలన్న ఉద్దేశంతో పాత పథకాన్నే అమలు చేయాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన విధంగానే క్లస్టర్ల వారీగా కొనసాగించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఆహార ధాన్యాల పంటలకు 2 శాతం, పత్తి, మిర్చి సహా ఇతర వాణిజ్య, వాతావరణ ఆధారిత పంటలకు 5 శాతం ప్రీమియాన్ని రైతుల నుంచి వసూలు చేయాలని నిర్ణయించారు. అయితే, వివిధ జిల్లాలు, అక్కడి వాతావరణ పరిస్థితులను బట్టి ప్రీమియం మారే అవకాశమున్నది. రైతు వాటా ప్రీమియాన్ని సైతం ప్రభుత్వమే చెల్లిస్తుందని ఇప్పటికే పలువురు మంత్రులు ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలోని రైతులంతా ఈ పథకంలోకి రానున్నారు. ఇందుకోసం కోసం జిల్లా, రాష్ట్రస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు.

